## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థల పరిశీలన



ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఈ ఓస్కార్

రామాయంపేట, మే 18: పట్టణంలో మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని రాష్ట్ర విద్యాశాఖ డివిజనల్ ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్ అధికారులు ఓస్కార్, పొన్ని, ప్రభాకరన్, క్వాంటిటీ సర్వేయర్ ఓబుల్ రెడ్డి, స్ట్రక్చరల్ ఇంజినీర్ ఫయాజాన్ అహ్మద్, డీఈ.నర్సింహ్మాచారిలు ఆదివారం సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రామాయంపేటలో త్వరలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను మొదలు పెట్టాలని తహసీల్దార్ రజినీకుమారికి ఆదేశించారు. ప్రభుత్వం నిర్మించే పాఠశాలకు పూర్తి స్థాయి సర్వేలు నిర్వహించామన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఇక్కడ మంచి వాతావరణం ఉందని, విద్యార్థులు మంచి చదువులు చదవాలని తెలిపారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చించి నిర్మించే రెసిడెన్సియల్ స్కూల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీకి చెందిన విద్యార్థులు చదువు అభ్యసిస్తారన్నారు. ఈ ప్రాంతంలో విద్యార్థులకు ఈ పాఠశాల ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. పాఠశాల నిర్మాణం అనంతరం అన్ని వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

## భూ నిర్వాసితులకు న్యాయం చేస్తా



ఎంపీని కలిసిన రామాయంపేట భూ బాధితులు

రామాయంపేట, మే 18: మెదక్-ఎల్కతుర్తి రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న భూ బాధితులకు పూర్తి న్యాయం చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణం నుంచి హైదరాబాద్‌లో ఉన్న ఎంపీ స్వగృహానికి రామాయంపేటకు చెందిన భూ బాధితులు వెళ్లికలిశారు. తమ భూమలు మెదక్ ఎల్కతుర్తి రోడ్డులో పోతున్నాయని, తమకు భూముల విలువను బట్టి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. దీంతో ఎంపీ బాధితులకు తనవంతు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు



వెలుగుతున్న వీధిలైటు

రామాయంపేట, మే 18: రామాయంపేటలో వీధిలైట్లు పట్టపగలు వెలుగుతున్నాయి. ఆదివారం పాత జాతీయ రహదారి, రెవెన్యూ కార్యాలయం, బీసీ కాలనీ రోడ్డులో విద్యుత్ స్తంభాలకున్న లైట్లు కొన్ని రోజులుగా పగలు, రాత్రి వెలుగుతూనే ఉన్నాయి. మున్సిపల్ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు తెలిపారు. ఒక పక్క విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రభుత్వం విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నా పురపాలక శాఖ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శిస్తున్నారు.

## కుక్కల దాడిలో గొర్రెల మృతి

చిన్నశంకరంపేట, మే 18: కుక్కల దాడిలో నాలుగు గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని కుర్మపల్లిలో ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకున్నది. కుర్మపల్లి గ్రామంలో నర్సింలుకు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరికొన్ని గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటనలో రూ.50వేల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు నర్సింలు బోరున విలపిస్తూ తెలిపారు.

## బాలుడిని, బాలికను కాపాడిన పోలీసులు

### - అభినందించిన ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



తప్పిపోయిన బాలుడిని రక్షించిన పోలీసులు



నీట మునిగిన బాలికను రక్షించిన పోలీసులు

పాపన్నపేట, మే 18: తల్లిదండ్రుల నుంచి తప్పి పోయిన బాలుడిని, నీట మునిగిన బాలికను పోలీసులు రక్షించి అప్పగించిన ఘటనలు మండలంలోని ఏడుపాయల్లో చోటుచేసుకున్నాయి. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏడుపాయల వన దుర్గా భవానీ మాతను దర్శించుకునేందుకు కామారెడ్డి జిల్లాలోని చింతపల్లి గ్రామానికి చెందిన నరేశ్ గౌడ్ కుటుంబసభ్యులతో కలిసి ఏడుపాయలకు ఆదివారం వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని వస్తున్న క్రమంలో లలిత్ గౌడ్(బాలుడు) తల్లిదండ్రుల నుంచి తప్పిపోయాడు. రాజగోపురం వద్ద అటుఇటు తచ్చాడుతున్నాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక పోలీసులు బాలుడిని చేరదీసి వివరాలు తెలుసుకున్నారు. అదే సమయంలో కుటుంబీకులు ఈవో కార్యాలయం వద్ద చేరుకోగా బాలుడి తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. మరో ఘటనలో ఒక బాలిక చెక్ డాం వద్ద నీట మునిగింది. ఆ బాలికను పోలీసులు కాపాడి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పోలీసులను ప్రజలు భక్తులు ప్రశంసించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ప్రత్యేక క్యూఆర్టీ పోలీస్ ఏఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ యాదగిరి, రాజేందర్లను అభినందించారు.

## ఘనంగా మాణిక్ ప్రభు జాతర

పెద్దశంకరంపేట,మే18: మండలంలోని మక్తలక్ష్మాపూర్‌లో ఆదివారం మాణిక్ జాతర అంగరంగ వైభవంగా ప్రారంభించారు. వేద బ్రాహ్మణల మంత్రోశ్చరణలతో ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని భాజాబజంత్రీలతో శివసత్తుల పూనకాలు, పోతరాజుల నృత్యాలతో పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామికి బోనాలు సమర్పించారు. ఈనెల 19న బండ్ల ఊరేగింపు, 20న కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

# నడకే.. నరకం

- గుంతల రోడ్లతో ఇబ్బందులెన్నో?
- రెండేండ్లుగా పనులకు నోచుకోని పల్లె ప్రాంత రోడ్లు
- కంకర తేలిన రోడ్లతో విద్యార్థులు, పల్లె ప్రాంత వాసుల ప్రయాణం నరకం
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో పల్లెలకు ప్రయాణ సౌకర్యం
- కాంగ్రెస్ సర్కార్ రాకతోనే నిలిచిన ఆర్టీసీ బస్సులు



కంకర తేలిన నిజాంపేట మండలంలోని నందిగామ-బచ్చరాజుపల్లి రోడ్డు



అధ్వాన్న స్థితిలో ఉన్న రామాయంపేట మండలంలోని పర్వతాపూర్ రోడ్డు

రామాయంపేట, మే 18: గుంతలు పడ్డ రోడ్లపై నడవాలంటే కంకర మూలంగా కాళ్లన్ని బొబ్బలెక్కుతున్నాయన్నాయి. కొత్త ప్రభుత్వంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న మారుమూల గ్రామాల ప్రజలకు నిరాశే మిగిలింది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సీఎం కేసీఆర్ వేసిన రోడ్లే తప్ప రెండేండ్ల కింద ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు ఒక్క రోడ్డు కూడా వేయకపోయింది. దీంతో పాటు మారుమూల ప్రాంతాలకు నడిచే ఆర్టీసీ బస్సులను నిలిపివేయడంతో పల్లె ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలను గుప్పించి ఓట్లు వేసుకుని, నేడు గద్దెనెక్కి పల్లెప్రాంత ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందంటూ వాపోతున్నారు. గతంలో మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిచేవి. ప్రస్తుతం బస్సులు రాక విద్యార్థులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజాంపేట మండలం కల్వకుంట నుంచి తిప్పనగుల్ల, బచ్చరాజుపల్లె, రాయిలాపూర్ గ్రామం మీదుగా బస్సు పొద్దున, సాయంకాలం నడిచేది. కంకరతేలి గుంతలమయం కావడంతో రెండేండ్లుగా నిలిచిపోయింది. రామాయంపేట మండల వ్యాప్తంగా లక్ష్మాపూర్ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కాట్రియాల, దంతెపల్లి, పర్వతాపూర్ రోడ్లు కూడా అస్తవ్యస్తంగా మారడంలో నడక నరకప్రాయంగా మారింది. ప్రజలు మండల కేంద్రానికి రావాలంటేనే జంకుతున్నారు. కాంగ్రెస్ సర్కార్ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పెట్టి పల్లె ప్రాంతాలకు ప్రయాణికులను వెళ్దామంటే గతంలో నడిచిన ఆటోలు నడవకుండా అయ్యాయి. ఉచిత బస్సు మూలంగా ఆటోలు నడిపేవారు వారి ఆటోలను అమ్ముకుని కూలినాలి చేసుకుని బతుకీడుస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాదిరిగా రెండు మండలాలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్లకు నిధులను కేటాయించి బీటీ రోడ్లు వేసి ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా బస్సులను నడిపించాలని కోరుతున్నారు. రాత్రి పూట దవాఖానల కోసం మండల కేంద్రానికి రావాలంటే గతంలో ఆటోలు ఉండేవి, ఇప్పుడు ఆ ఆటోలు కూడా లేవు. తాము దవాఖానలకు రావాలంటే అష్టకష్టాలు పడుతున్నామని స్థానికులు కోరుతున్నారు.

### సర్కారు ఆర్టీసీ బస్సులను నడపాలి

ఉమ్మడి రామాయంపేట, నిజాంపేట మండలాలకు చెందిన దంతెపల్లి, పర్వతాపూర్, కాట్రియాల, లక్ష్మాపూర్, కల్వకుంట, బచ్చరాజుపల్లి, రాయిలాపూర్, తిప్పనగుల్ల, నందిగామ గ్రామాల ప్రజలు తమకు కాంగ్రెస్ ఏర్పడిన నాటి నుంచి ఆర్టీసీ బస్సులు నడపడం లేదని ఆరోపిస్తున్నారు. రెండేండ్ల నుంచి బస్సులు, ఆటోలు బందై కాలినడకన మండల కేంద్రాలకు వెళ్తున్నామన్నారు. తమ గ్రామాలకు బస్సులు లేవు, కనీసం మా గ్రామాల ప్రజలు ఎలా ఉన్నారని అడిగే నాథుడు కూడా కరువయ్యిండని వాపోతున్నారు. ఓట్లప్పుడు అన్ని చేస్తామని హామీలిస్తే కాంగ్రెస్‌కు ఓటేసినామని, హామీలిచ్చి నేడు గ్రామాలను పడావు ప్రాంతాలుగా చేసిండ్రని వాపోయారు. తమ గ్రామాలకు బస్సులు, రోడ్లు వేయాలని, పల్లె ప్రాంతాల్లో చదువుకునే పిల్లలు కూడా నడుచుకుంటూ వెళ్లడం తప్పడంలేదన్నారు. బస్సులరాక చదువులు కూడా ఆపేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ గ్రామాలకు కనీస సౌకర్యాలను కల్పించాలని కోరారు.



నిజాంపేట మండలం కల్వకుంట-తిప్పనగుల్ల రోడ్డు



బస్సులు వేయాలని కోరుతున్న బచ్చరాజుపల్లివాసులు



రామాయంపేట: దంతెల్లిలో కంకర రోడ్డు దుస్థితి

## వనదుర్గకు జనహారతి



పూజలందుకుంటున్న అమ్మవారు

పాపన్నపేట,మే 18: భక్తుల కోరికలు తీర్చే తల్లిగా విరాజిల్లుతున్న వనదుర్గా భవానీ మాతలో క్షేత్రం దుర్గమ్మకు జన హారతి పట్టారు. వేసవి సెలవులు, ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు.వీరు మాంజీరా నదిలో వివిధ పాయల్లో పుణ్య స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బం ది శ్రీనివాస్,ప్రతాప్‌రెడ్డి,శ్యాం,బత్తిని రాజు,నర్సింహులు, మహేశ్, వరుణాచారి తదితరులు ఏర్పాటు చేశారు. వేదపండితులు శంకరశర్మ, పార్థీవ శర్మ, రాము శర్మ, నాగరాజు శర్మ తదితరులు పూజలు నిర్వహించారు. ఏడుపాయల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టారు.



పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు

## టెక్నోజియం పోటీల్లో బీవీఆర్ఐటీ విజేతలు



నగదు బహుమతిని పొందుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

నర్సాపూర్,మే18: బెంగళూర్ నగరంలో నిర్వహించిన ఎల్అండ్‌టీ టెక్నోజియం జాతీయ స్థాయి విద్యార్థుల ప్రాజెక్టు జట్ల పోటీలు నిర్వహించారు. 8వ జాతీయ స్థాయి ఎల్అండ్‌టీ టెక్నోజియం పోటీలకు దేశ వ్యాప్తంగా 569 విద్యాసంస్థల నుంచి 4669 కాన్సెప్టులు సమర్పించి, 40 వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. చివరగా 36 జట్లు ఫైనల్స్‌కు ఎంపికయ్యాయి. ఈ ఫైనల్ పోటీల్లో బీవీఆర్ఐటీ కళాశాలకు చెందిన రెండు ప్రాజెక్టులకు అవార్డులు వచ్చినట్లు కళాశాల డైరెక్టర్ డా.లక్ష్మీప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డా.సంజయ్‌దూబే వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎల్అండ్‌టీ పోటీల్లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు ఫైనల్స్‌లో రెండో రన్నరప్‌గా అవార్డుతో పాటు రూ.3 లక్షల నగదు బహుమతిని గెలుపొందారని తెలిపారు. విద్యార్థులు 9 నెలల వ్యవధిలో ప్రాజెక్టు నమూనాలు తయారుచేసి ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ ఇంజినీర్లతో కలిసి పనిచేసి వినూత్నమైన ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ ప్రోటోటైపులను అభివృద్ధి చేయటానికి విద్యార్థులు, అధ్యాపకులు కష్టపడి పనిచేశారన్నారు. జాతీయ స్థాయిలో గొప్ప ఆలోచనలతో గెలుపొందినందుకు సంతోషంగా ఉందని విష్ణు విద్యాసంస్థల చైర్మన్ విష్ణు రాజు తెలిపారు. వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య విస్సం విజేతలైన అధ్యాపకులు డా.షైక్ షరీఫ్, డా.అనిరుద్‌రెడ్డి, విద్యార్థులు యశ్వంత్, వంశీకృష్ణ, అభిలాష్, విష్ణులను అభినందించారు.

## ఆపత్కాలంలో సీఎంఆర్ఎఫ్ ఆసరా: ఎమ్మెల్యే



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, మే 18 : ప్రజలకు ఆపత్కాలంలో ప్రభుత్వం అందించే సీఎంఆర్ఎఫ్ ఎంతో ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శివ్వంపేట మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన గొర్రె మధుసూదన్‌రెడ్డికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గోవింద్‌నాయక్ , ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య తదితరులు ఉన్నారు.

### రామాయంపేటలో..



రామాయంపేట: డి.ధర్మారంలో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న గ్రామస్తులు

రామాయంపేట, మే 18: డి.ధర్మారంలో అనారోగ్యానికి గురై కార్పొరేట్ దవాఖానలో చికిత్స చేయించుకున్న బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన వడ్ల విశ్వనాథం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ దవాఖానలో చికిత్సలు నిర్వహించుకున్నాడు. ఆయనకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.51వేలను గ్రామస్తులు ఆయన ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు తదితరులు ఉన్నారు.

## అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



కౌడిపల్లి: వెంకట్రావ్‌పేట్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



కొల్చారంలో సిబ్బంది హాజరు పట్టికను పరిశీలిస్తున్న కలెక్టర్

- వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందించాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, మే18: అకాల వర్షాలు పడుతున్నందున కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ధాన్యం తడువకుండా అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని వెంకట్రావ్‌పేట్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. వడ్ల తేమశాతాన్ని పరిశీలించి, రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సంఘమేశ్వర్, ఆర్ఐ శ్రీహరి, సీసీ నర్సింలు పాల్గొన్నారు.

### కొల్చారంలో..

కొల్చారం, మే 18: వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలదించాలని కలెక్టర్ తెలిపారు. ఆదివారం కొల్చారం పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులు, ప్రసూతి విభాగం, మందుల స్టాక్ వంటివి పరిశీలించారు. ఓపీ రిజిస్టర్, సిబ్బంది హాజరు పట్టీ తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజలు ప్రభుత్వ దవాఖానల్లోని వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఏంపీహెచ్‌ఈవో మదన్‌మోహన్, సిబ్బంది గౌరి ప్రియాంక, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మడేలేశ్వర ఆలయ వార్షికోత్సవాలు

నిజాంపేట, మే18: నిజాంపేటలోని మడేలేశ్వర ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలను గ్రామ రజక సంఘం సభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోచమ్మ, మడేలేశ్వర స్వామికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ రజక సంఘం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారికి బోనాల ఊరేగింపు

చిన్నశంకరంపేట, మే18: మండలంలోని అంబాజిపేటలో ఆదివా రం గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామదేవత పోచమ్మ, దుర్గమ్మ అమ్మవార్లకు బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా బైండ్ల వారి డండకాలు జముడుక నినాదాలతో గ్రామం మారుమోగింది. శివసత్తుల పూనకాలతో బోనాల ఊరేగింపు కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి ఒడిబియ్యాన్ని సమర్పించారు. కొందరు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి

చిన్నశంకరంపేట, మే18: నూతన వధూవరులను మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆశీర్వదించారు. మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ బుజ్జి కుమార్తె శ్వేత వివాహాన్ని ఆదివారం నిర్వహించారు. వివాహానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లిఖార్జున్‌గౌడ్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## మెదక్ చర్చిలో భక్తుల ప్రార్థనలు



దైవ సందేశం వినిపిస్తున్న ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, మే 18: మెదక్ చర్చి భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో భక్తులు, పర్యాటకులు తరలిరావడంతో చర్చి ప్రాంగణమంతా కిక్కిరిపోయింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంట గంటకూ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వందలాది భక్తులు పాల్గొని యేసయ్యకు మొక్కులు చెల్లించుకున్నారు. చర్చి ప్రెసీబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య, పాస్టర్లు శ్రీనివాస్, జైపాల్, డేవిడ్ భక్తులనుద్దేశించి దైవ సందేశం వినిపించారు. ఈ సందర్భంగా భక్తులు వసతి గృహాలతో పాటు చర్చి ఆవరణలోని చెట్ల కింద వంటావార్పు చేసుకున్నారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సువన్‌డగ్లస్, నోబుల్‌సన్, సంశాన్ సందీప్, ప్రాంక్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రముఖులకు ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న శ్రీగురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్

శివ్వంపేట, మే 18: మండలంలోని గూడురులో నిర్మించిన శ్రీగురుపీఠంలోని దత్తాత్రేయ మహాస్వామి, శ్రీషిర్డీ సాయినాథ విగ్రహాల ప్రాణప్రతిష్ఠ జూన్ 5న ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాలకు రావాలని కోరుతూ బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డికి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందకు, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్నూరుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి హనుమంతరావుకు శ్రీగురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్ ట్రస్టు సభ్యులతో కలసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో గౌరవ ట్రస్టు సభ్యులు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాలమణి నరేందర్ తదితరులు ఉన్నారు.



కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందకు ఆహ్వాపత్రిక అందజేస్తున శ్రీగురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్, సభ్యులు

## ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రం కుట్ర

- ఈనెల 30వ తేదిన కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ




మెదక్ మున్సిపాలిటీ, మే 18: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు సమయానికి కూలి డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తూ, ఫొటో విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కూలీలకు జాబు కార్డులు ఇవ్వకుండా మోసం చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో లక్షల జాబు కార్డులు తీసీవేశారన్నారు. కూలి పెంచకుండా, పనిరోజులు పెంచకుండా పథకాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందన్నారు. అంతకుముందు జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ మెదక్ జిల్లాలో పార్ట్ బీలో గల 30 వేల ఎకరాల భూ సమస్యలను పరిష్కారించాలన్నారు. ఫారెస్ట్, రెవెన్యూ మధ్యలో గల విబేధాల సమస్యను పరిష్కారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని మున్సిపాలిటీల్లో అమలు చేయాలన్నారు. ఉపాధిహామీ కూలీలకు రూ.600 పెంచుతూ 200 రోజుల పని కల్పించాలన్నారు. పెండింగ్‌లో గల కూలీల డబ్బులు చెల్లించాలని, ప్రతి కూలీకి జాబ్‌కార్డు మంజూరు చేయాలని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదిన కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు మల్లేశం పేర్కొన్నారు. ఈ ధర్నాలో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యులు నాగమణి, లక్ష్మి, ఐలయ్య, రామస్వామి, పోచమ్మ, సంతోష్ పాల్గొన్నారు.